సాక్షి అనకాపల్లి

గురువారం । 9 । మార్చి । 2023



విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి పునరుద్ధరించారు. 8లో



మోదకొండమ్మ ఉత్సవం

పాడేరు మోదకొండమ్మ తల్లి ఉత్సవాల తేదీలు ఖరారయ్యాయి. మే 14, 15, 16 తేదీల్లో పండగ నిర్వహించనున్నారు. 8లో



పరీక్ష కాలం..

నేటి నుంచి ఫార్మేటివ్, ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 15 నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. 10లో


న్యూస్‌రీల్

14న కంచి పీఠాధిపతి నర్సీపట్నం రాక



నర్సీపట్నం: ఈనెల 14వ తేదీన నర్సీపట్నం రానున్న కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామికి ఘన స్వాగతం పలికేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, ప్రముఖ వైద్యుడు పి.లక్ష్మీకాంత్ పేర్కొన్నారు. స్వామీజీ రాకను పురస్కరించుకుని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో పర్యటన వాల్‌పోస్టర్‌ను వారు బుధవారం ఆవిష్కరించారు. ఆ రోజున శోభాయాత్ర శ్రీకన్య జంక్షన్ వద్ద ప్రారంభమై అబిద్ సెంటర్ మీదుగా టీటీడీ కళ్యాణ మండపం చేరుకుంటుందన్నారు. సాయంత్రం భక్తులకు స్వామీజీ అనుగ్రహభాషణం చేస్తారని తెలిపారు. సమావేశంలో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, న్యాయవాది మెట్టా ప్రభాకర్, పురోహితుల సంఘం అధ్యక్షుడు రామం పాల్గొన్నారు.

20 నుంచి నూకాంబిక అమ్మవారి జాతర



అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను ఈనెల 20 నుంచి ఏప్రిల్ 19వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆర్డీవో చిన్నికృష్ణ చెప్పారు. ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై బుధవారం ఆయన సమావేశమయ్యారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులను కోరారు. తాగునీటి సరఫరాకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి బుద్ధ మహాలక్ష్మినగేష్, ఆలయ ఈవో చంద్రశేఖర్, జీవీఎంసీ అధికారులు, సీఐ దాడి మోహన్, ఎన్టీఆర్ వైద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో మైత్రేయికి అంతర్జాతీయ ఖ్యాతి



పతకం సాధించిన ఎన్నిటి మైత్రేయి

కొమ్మాది (భీమిలి): అంతర్జాతీయ ఈత పోటీల్లో ఎండాడకు చెందిన 5 ఏళ్ల బాలిక ఎన్నిటి మైత్రేయి పతకాలు సాధించింది. బ్యాంకాక్‌లో ఈ నెల 2వ తేదీ నుంచి ఏషియన్ ఓపెన్ స్కూల్స్ ఇన్విటేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్–2023 పేరుతో నిర్వహించిన ఈత పోటీల్లో మైత్రేయి పాల్గొంది. 48 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. భారత దేశం నుంచి 80 మంది ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నలుగురు ఎంపిక కాగా.. అందులో ఎండాడకు చెందిన మైత్రేయి ఒకరు.

ఆనందపురం ఎంఈవో సస్పెన్షన్

ఆనందపురం (భీమిలి) : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారని ఆనందపురం మండల విద్యాధికారి ఎస్ఎస్ పద్మావతిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సస్పెండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అనుసరించి తమ విధులను నిర్వహించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున హెచ్చరించారు.

మహిళల వేడుక.. ఆనంద వీచిక



విశాఖలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, తదితరులులు

నీ కాటుక కనులు విప్పారకపోతే
ఈ భూమికి తెలవారదుగా...
నీ గాజుల చేయి కదలాడకపోతే
ఏ మనుగడ కొనసాగదుగా...
ప్రతి వరసలోను ప్రేమగా అల్లుకున్న బంధమా..
అంతులేని నీ శ్రమ అంచనాలకందునా...
ఆలయాలు కోరని ఆదిశక్తి రూపమా
నీవులేని జగతిలో దీపమే వెలుగునా...

అంటూ ఓ సినీ కవి మహిళల ఔన్నత్యాన్ని గొప్పగా వర్ణించారు. అందుకు దీటుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా మహిళలను గౌరవించుకున్నారు.. అభినందించారు. సత్కరించారు.



మహిళలకు కేక్ తినిపిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

● అతివలకే అగ్రతాంబూలం

దేవరాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్నింటా మహిళలకే అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువ క్యాంప్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి మహిళలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో, నామినేటెడ్ పదవుల్లో అత్యధికంగా అవకాశం కల్పించడం చరిత్రాత్మకమన్నారు. మాడుగులలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ అద్భుత ఫలితాలు సాధిస్తోందని ముత్యాలనాయుడు చెప్పారు.



మంత్రి అమర్‌నాథ్‌కు కేక్ తినిపిస్తున్న ఎంపీ సత్యవతి, పక్కన ఈర్లె అనురాధ

● మహిళా సాధికారత సాకారం

సాక్షి, అనకాపల్లి: సమాజంలో మహిళల పాత్ర కీలకమని మంత్రి అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ మహిళా సాధికారతను అమలు చేసి చూపిస్తున్నారన్నారు. ఎంపీ డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ మహిళల రక్షణకు దిశ చట్టం ప్రవేశపెట్టిన దార్శనికుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అభివర్ణించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం

వైభవంగా ఉమా ధర్మలింగేశ్వరస్వామి వివాహ వేడుక



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

రాంబిల్లి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రంలో శ్రీ ఉమా ధర్మలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. మంగళవారం రాత్రి ప్రారంభమైన కల్యాణ ఘట్టం బుధవారం తెల్లవారుజాము వరకు కనుల పండవగా సాగింది. పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్త జనం కల్యాణ మహోత్సవాన్ని తిలకించి పరవశించారు. అమ్మవారు, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణ ఘట్టం అనంతరం శ్రీ ఉమా ధర్మలింగేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లు కార్యక్రమాలను నిర్వహించారు. కోలాటాల బృందానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు సుందరపు బాబు సౌండ్ స్పీకర్ సెట్‌ను అందించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధి ముత్తా సూరిబాబు, అర్చక బృందం, ఎండోమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్‌కు ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లు



కలెక్టరేట్‌కు వచ్చిన ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లు

దొండపర్తి (విశాఖ దక్షిణ): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లు కర్నూలు జిల్లా నుంచి బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో శ్రీనివాసమూర్తి తెలిపారు. ఇక్కడి నుంచి శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు పంపించినట్లు వెల్లడించారు. విశాఖ జిల్లాకు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో వెరిఫికేషన్ చేస్తామన్నారు.

మా ఇంటి వైద్యుడు



మంచానపడిన రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ దమయంతీదేవి

- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటా ధైర్యం
- రోగుల ఇంటికే వైద్య నారాయణులు
- ట్రయల్ రన్‌లో సత్ఫలితాలిస్తున్న ఫ్యామిలీ డాక్టర్
- జిల్లాలో ఇప్పటి వరకు 1,16,752 మందికి వైద్య సేవలు

వయోభారంతో మంచానపడిన పండుటాకులను పరామర్శించేందుకు ఎవరైనా వస్తే చాలు.. ఆ వృద్ధులకు ప్రాణం లేచి వస్తుంది. పరామర్శించిన వారు తమ బంధువర్గమో, చిరపరిచితులో అయితే వారి కళ్లల్లో ఆశల వెలుగులెన్నో..! అయితే నేరుగా వైద్య బృందమే తరలి వస్తే.. వచ్చిన వారు తన చేయందుకుని భరోసా కల్పిస్తే.. అనారోగ్యాన్ని ఆరాతీసి చికిత్స అందిస్తే.. వారిలో కలిగే ఆనందాన్ని అంచనా వేయగలమా? సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదల బతుకుల్లో వెలుగులు నింపుతోంది. మా ఇంటి వైద్యుడంటూ వారిలో నమ్మకాన్ని పెంచుతోంది.



పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

చోడవరం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తుండటంతో మంచాన పడిన రోగులకు భరోసా దొరికింది. నానా యాతనలు పడి ఆస్పత్రులకు వెళ్లే తిప్పలు తప్పడంతో వారిలో ఆనందం పెంచింది. ట్రయల్‌రన్‌లోనే ఈ పథకం సత్ఫలితాలు రాబడుతుందంటే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పూర్తిగా అమలైతే వయోవృద్ధులతోపాటు సాధారణ రోగాల బారిన పడిన వారికీ మేలు జరగనుంది. నెలలో ఒకట్రెండు సార్లు ఇంటికే డాక్టర్ రావడం వారిలో సంతోషాన్ని నింపుతోంది.

అవగాహన.. ఆదరణ

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కేవలం దీర్ఘకాలిక వ్యాధులతో మంచానపడిన వారికి మాత్రమే పరిమితం కావట్లేదు. ముందుగా ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. వివిధ రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. తగిన మందులను ఉచితంగానే అందిస్తున్నారు. బాలింతలు, గర్భిణులు దూరాన ఉన్న ఆస్పత్రికి వెళ్లాల్సిన పని లేకుండా అక్కడే వారికి తగిన వైద్యం, సలహాలు, సూచనలు అందిస్తున్నారు. మధ్యాహ్నం ఇంటింటికీ వెళ్లి మరీ రోగుల యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాలను సందర్శించి పిల్లలు, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపడుతున్నారు. మునుపెన్నడూ ఇలాంటి ఆదరణ చూడలేదంటూ గ్రామస్తులు పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 1,16,752 మంది రోగులకు సాంత్వన

అనకాపల్లి జిల్లాలో ఇప్పటి వరకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఒక లక్షా 16 వేల 752 మంది రోగులకు సాంత్వన లభించింది. గత ఏడాది అక్టోబర్ 21న ఈ కార్యక్రమ ట్రయల్ రన్‌ను చేపట్టారు. అనకాపల్లి జిల్లాలోని 24 మండలాల్లో ఉన్న 424 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నాటి నుంచి నేటి వరకు రోజు వారీ ఏదో ఒక గ్రామంలో ట్రయల్ రన్ కొనసాగుతూనే ఉంది. జిల్లాలోని 424 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలోని గ్రామాల్లో జరిగే వైద్యశిబిరాల్లో రోజుకు 60 నుంచి వంద మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. ఆయా పీహెచ్‌సీల వారీగా ఈ కార్యక్రమం సెలవు రోజులు మినహా విజయవంతంగా ముందుకు సాగుతోంది.

నెలకు సరిపడా మందులు



మాది చోడవరం మండలంలోని జగన్నాథపురం. నాకు బీపీ, సుగరు ఉంది. గవరవరం ఆస్పత్రికి నడుచుకుని వెళ్లేదాన్ని. అక్కడ మాత్రలు ఇచ్చేవారు. ఈ మధ్య మా ఊరికే డాక్టర్ వచ్చారు. నాకు అన్ని పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మాత్రలు కూడా ఇచ్చారు. మాలాంటి వయసుమళ్లినోళ్లకు ఇంతకంటే ఏం కావాలి.

– ఎస్.మహాలక్ష్మమ్మ

ఇంటికి వచ్చి చూస్తున్నారు



మాది చోడవరంలోని లక్కవరం. డాక్టర్లు, నర్సులు మంచం మీద ఉన్న రోగుల కోసం ఇంటికే వస్తున్నారు. ఇది మాకు ఎంతో ఆనందాన్నిస్తోంది. సొంత బంధువులే వారిని పెద్దగా పట్టించుకోని పరిస్థితి. అలాంటిది డాక్టర్లు నెలకు కనీసం రెండుసార్లు రోగులున్న చోటికే వచ్చి వైద్యం చేస్తున్నారు. ఎంతో మంది ముసలోళ్లకు మేలు కలుగుతోంది.

– ఎల్.సూర్యనారాయణ

దీర్ఘ రోగులపై ప్రత్యేక శ్రద్ధ



దీర్ఘకాలిక వ్యాధులతో మంచాన పడిన రోగులను మా వైద్య సిబ్బంది ఇంటికెళ్లి పరీక్షిస్తున్నారు. ముఖ్యంగా పక్షవాతం బారిన పడిన వారు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నవారిని స్వయంగా కలిసి వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రజలనుంచి మంచి స్పందన లభిస్తోంది.

– డాక్టర్ హేమంత్, డీఎంహెచ్‌వో

నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణకు పబ్లిక్ నోటీసు జారీ



మెయిన్ రోడ్డుకు సెంటర్ మార్కింగ్ ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సీపట్నం: పట్టణంలోని రెండు ప్రధాన రోడ్ల విస్తరిస్తున్నట్లు పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు పబ్లిక్ నోటీసు జారీ చేశారు. బుధవారం పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ శాఖ అధికారులు సెంటర్ మార్కింగ్ ఇచ్చారని కమిషనర్ పేర్కొన్నారు. అబిద్స్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు 1.5 కిలోమీటర్లమేర వంద అడుగుల రోడ్డు విస్తరణ, వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు 2.5 కిలోమీటర్లమేర కొత్తగా బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామంటూ నోటీసులో పేర్కొన్నారు. ఈ రెండు రహదారుల విస్తరణకు ప్రభుత్వం రూ.16.60 కోట్లు కేటాయించిందన్నారు. కౌన్సిల్ తీర్మానం మేరకు రోడ్ల విస్తరణ చేపడుతున్నామన్నారు. వంద అడుగుల వెడల్పున రోడ్ల విస్తరణకు రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ముసాయిదా ప్రతిపాదనను రెవెన్యూ ఎఫ్ఎంబీ ప్రకారం హద్దులు నిర్ణయించామన్నారు. ముసాయిదాను రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ విశాఖపట్నం వారికి పంపించామన్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్‌ను మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్, రోడ్లు భవనాలశాఖ కార్యాలయాల వద్ద సమాచారం నిమిత్తం ఉంచామని నోటీసులో కమిషనర్ పేర్కొన్నారు.

హైకోర్టులో కెవియట్ పిటిషన్

ఏజెన్సీ ముఖద్వారం, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం ప్రధాన రహదారి విస్తరణను న్యాయస్థానం ద్వారా అడ్డుకునే అవకాశం ఉందన్న ఉద్దేశంతో న్యాయవాది, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర హైకోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయాన్ని బుధవారం ఆయన విలేకరులకు వెల్లడించారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు, సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారని, లక్షలాదిమంది ప్రజల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని వందడుగుల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టారని వివరించారు. ఈ పనులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ముందస్తుగా అఫిడవిట్ సమర్పించామన్నారు. ప్రతివాదులకు నోటీసులు అందజేశామన్నారు.

ఆకుపచ్చ పోరాటయోధుడు రాంబాబు మాస్టారు

'ఇన్‌స్పైర్ అనకాపల్లి' వెబ్‌సైట్‌లో కలెక్టర్ ప్రశంసలు



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న రాంబాబు మాస్టారు

రోలుగుంట: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని ప్రచారం చేస్తూ.. ఒక ఉద్యమంలా ముందుకు సాగుతున్న ఉపాధ్యాయుడు అప్పన రాంబాబును కలెక్టర్ ఆకుపచ్చ పోరాటయోధుడిగా అభివర్ణించారు. ఆ స్ఫూర్తిని అందరం అందిపుచ్చుకోవాలని ఆయన జిల్లా ప్రజలను కోరారు. ఇన్‌స్పైర్ అనకాపల్లి పేరిట కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఒక వెబ్‌సైట్‌ను రూపొందించారు. అందులో జిల్లాకు చెందిన సేవామూర్తులు, ఆదర్శప్రాయుల గురించి పరిచయం చేస్తున్నారు. ఆ వెబ్‌సైట్‌లో తాజాగా రాంబాబు మాస్టారి గురించి కలెక్టర్ విపులంగా పేర్కొన్నారు. రోలుగుంట మండలంలో కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న అప్పన రాంబాబు సామాజిక సేవలను ఆయన ప్రశంసించారు. పర్యావరణాన్ని రక్షించేందుకు ఆయన నాటిన, నాటించిన వివిధ జాతుల మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావని పేర్కొన్నారు.

ఏడేళ్ల ప్రస్థానం

రాంబాబు ఏడేళ్ల క్రితం నాతవరం మండలం చమ్మచింతలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ వృక్షమిత్ర సమితి ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా కృషి చేస్తున్నారు. ఎంతోమందిలో అవగాహన కల్పించారు. తాను పనిచేసిన గ్రామాల్లో స్థానిక నాయకులు, అటవీ అధికారుల తోడ్పాటుతో ఇప్పటికి లక్షా 75 వేల మొక్కలను నాటించి వాటిని సంరక్షిస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు. ఈ ఏడాది రిపబ్లిక్‌డే రోజున కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. కొంతమంది పేద విద్యార్థులను దత్తత తీసుకొని వారి విద్యాభివృద్ధికి తన వంతుగా ఆర్థిక సాయం చేస్తున్నారు. రాంబాబు మాస్టారి సేవలను కొనియాడుతూ కలెక్టర్ ఆయనను 'ఆకుపచ్చ పోరాట యోధుడి'గా కితాబిచ్చారు. దీనిపై స్పందించిన రాంబాబు మాస్టారు 'సాక్షి'తో మాట్లాడుతూ కలెక్టర్ ప్రశంస తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. భవిష్యత్‌లో కూడా సేవలు కొనసాగిస్తానని చెప్పారు. తనకు సహకరించిన సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, వృక్షమిత్ర సమితి సభ్యులు, ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మాస్టారి గురించి కలెక్టర్ వెబ్‌సైట్‌లో పేర్కొనడం తమకు ఎంతో ఆనందం కలిగించిందని, గర్వంగా ఉందని హెచ్ఎం అచ్యుతం పేర్కొన్నారు.



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి నుంచి రిపబ్లిక్‌డే నాడు ప్రశంసా పత్రం అందుకుంటున్న రాంబాబు మాస్టారు (ఫైల్)

క్లుప్తంగా

డాక్టరమ్మకు సత్కారం



సాక్షి, విశాఖపట్నం : ప్రముఖ వైద్యురాలు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతికి రాష్ట్ర అవార్డును ప్రదానం చేస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది.

బాలుడి పూర్తి వివరాలు లభ్యం

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు జాతీయరహదారిపై మంగళవారం రాత్రి గాయపడి మృతి చెందిన బాలుడు యలమంచిలి ఎన్టీఆర్ కాలనీకి చెందినవాడని పోలీసులు నిర్ధారించారు. బాలుడి మేనమామ పోలీసులకు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు సేరా సాయిరాం (15) అమ్మమ్మ వద్దకు ఏడాది వయసులో దత్తతకు వచ్చాడు. తండ్రి మృతి చెందడంతో తల్లి మరో వ్యక్తిని వివాహం చేసుకుని ఢిల్లీ వెళ్లిపోయింది. సాయిరాం ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నాడు. చదువు పట్ల పెద్దగా ఆసక్తి లేక గతంలో రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 6వ తేదీన మళ్లీ ఇంటి నుంచి వెళ్లి పోయి 7వ తేదీన ప్రమాదానికి గురైనట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపు ఖాయం



ప్రచారం చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



నూతన వధూవరులను ఎమ్మెల్సీ ఓటు అభ్యర్థిస్తున్న జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ

మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి ఎన్నికల ప్రచారం

అనకాపల్లి టౌన్: వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం కొత్తూరు జంక్షన్‌లో ఆయన ఎంపీ సత్యవతితో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి తమ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పట్టభద్రులంతా అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వధూవరులను ఓటు అభ్యర్థించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ నాయకులు వినూత్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. బుధవారం దేవరాపల్లిలో నూతన వధూవరులు వరదపురెడ్డి వెంకటరావు, దేవిప్రియలను కలిసి ఎమ్మెల్సీ సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. దీంతో వివాహ వేడుకకు హాజరైన బంధువులంతా ఆసక్తిగా తిలకించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

150 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

సాదరంగా ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: మండలంలోని తురువోలు గ్రామానికి చెందిన 150 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం ఆధ్వర్యంలో బుధవారం దేవరాపల్లి మండలం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో చేరగా, వీరికి పార్టీ కండువాలు కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ నాయకులు పరవాడ కోటి, సుర్ల నాగేష్, ముర్రు కొండబాబు, సోలా లక్ష్మణ, సుర్ల రామునాయుడు, చొక్కాకుల నాగలక్ష్మి, కశిరెడ్డి స్వామిలతోపాటు మరో 143 మంది ముఖ్య కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అందరూ ఒకే కుటుంబంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీతోపాటు ప్రభుత్వం పరంగా ఏ అవసరమొచ్చినా నెరవేర్చి అండగా నిలుస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, సచివాలయాల కన్వీనర్ల చైర్మన్ చైతన్య, పార్టీ నేతలు పి.అచ్చిబాబు, సీహెచ్.కోటేశ్వరరావు, ముర్రు కోటి, జగ్గునాయుడు, పి.నారాయణమూర్తి, బి.అప్పలనాయుడు, సీహెచ్ వెంకునాయుడు, అరుణ్‌కుమార్, బి. నాని, సుర్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం, డోలోత్సవం

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి రథోత్సవం, అద్దపు సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులను పెద్దపల్లకిలో ఉంచి చోరమండపం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజలు నిర్వహించిన తర్వాత చోరసంవాదం కార్యక్రమం నిర్వహించారు. తిరుమంగై ఆళ్వారులను మూడుసార్లు మాడవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి రథోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భాలయంలో డోలోత్సవం (అద్దపుసేవ) జరిపారు. కల్యాణం అనంతరం స్వామివారికి దృష్టి దోషం కలుగుతుందన్న భావనతో స్వామివారిని భక్తులకు అద్దంలో చూపించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవీ, భూదేవీ సమేత స్వామివారిని పూల మాలలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.



ఉపమాక వెంకన్నకు అద్దపు సేవ నిర్వహిస్తున్న దృశ్యం

11 నుంచి 13 వరకు మద్యం దుకాణాల బంద్

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఉత్తరాంధ్ర జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు ఈ నెల 13వ తేదీన జరగనున్న దృష్ట్యా జిల్లాలో మూడు రోజుల పాటు అన్ని రకాల మద్యం దుకాణాలు మూసివేయడం జరుగుతుందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు(స్టార్ హోటళ్లలో సైతం), టూరిజం బార్స్, నేవల్ క్యాంటీన్స్, కల్లు దుకాణాలు, మద్యం డిపోలు కూడా మూసివేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఓట్ల లెక్కింపు జరిగే 16వ తేదీన కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో కూడా మద్యం దుకాణాలు తెరవడం జరగదన్నారు.

ఫెన్సింగ్ జిల్లా టీమ్ ఎంపిక నేడు

మధురవాడ (భీమిలి): మధురవాడలో నిర్వహించాల్సి జిల్లా ఫెన్సింగ్ బాల్ టీమ్ సెలక్షన్స్ అనివార్య కారణాలు వలన గురువారానికి మార్చినట్టు అసోసియేషన్ కార్యదర్శి పి. త్రినాథ్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి కాకినాడలో లేడీస్ క్లబ్ ద్రోణ అకాడమీలో నిర్వహించే 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. శ్రీకృష్ణ గ్రామర్ స్కూలులో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 96405 22141, 91827 16430 సంప్రదించాలన్నారు.

వృద్ధురాలి అంత్యక్రియల్లో హైడ్రామా

- ఆమె మృతిపై బంధువుల అనుమానం
- పోలీసుల జోక్యంతో అంతిమ సంస్కారాలు చేసిన కోడలు
- ఎ. కొత్తపల్లిలో ఘటన



అత్త మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేస్తున్న కోడలు చిన్నంకుమారి

దేవరాపల్లి: ఒక్కగానొక్క కుమారుడు, భర్త గతంలో మరణించారు.. జీవిత చరమాంకంలో ఆలపాలనా చూడాల్సిన కోడలు వదిలిపెట్టి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగానే కాలం వెల్లదీస్తున్న వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందగా, నాటకీయ పరిణామాల మధ్య ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. దేవరాపల్లి మండలం ఏ. కొత్తపల్లిలో చోటు చేసుకున్న ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

గ్రామానికి చెందిన చిన్నం వీరమ్మ (72) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. స్థానికులు, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, సచివాలయ కార్యదర్శి, మహిళా పోలీస్ మృతదేహాన్ని పరిశీలించారు. అనకాపల్లి సమీపాన దర్జీనగర్‌లో నివాసం ఉంటున్న మృతురాలు కోడలు చిన్నంకుమారికి సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలి మృతిపై బంధువులు అనుమానం వ్యక్తం చేయడంతో ఎస్‌ఐ నాగేంద్ర అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఇది సహజ మరణమేనని స్పష్టం చేశారు. వారి సమక్షంలోనే మృతురాలి ఇంట్లో సోదాలు చేయగా రూ.1.42 లక్షలతోపాటు భూమి డాక్యుమెంట్లు లభించాయి. వాటిని కోడలికి ఇచ్చేందుకు మిగిలిన బంధువులు నిరాకరించారు. దీంతో సమస్య పరిష్కారమయ్యే వరకు ఇవి సర్పంచ్ దగ్గర ఉంచాలని సీఐ ఎస్. తాతారావు ఫోన్లో చెప్పడంతో ఇరువర్గాలు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం సర్పంచ్ చొరవతో సచివాలయ, పారిశుధ్య సిబ్బంది సహకారంతో అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేయగా, ఆమె కోడలు తన కుమార్తెను వెంట బెట్టుకుని శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేసింది. బంధువులు ఎవరూ అంత్యక్రియల్లో పాల్గొనకపోవడంతో సర్పంచ్ సహా పాల సొసైటీ వేతన కార్యదర్శి లక్కరాజు పెద్దినాయుడు, వార్డు మెంబర్లు, గ్రీన్ అంబాసిడర్ లక్కరాజు వెంకటరమణ తదితర గ్రామ పెద్దలు సహాయ సహకారాలు అందించారు.

విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

- మాచ్‌ఖండ్‌లో పూర్తయిన మరమ్మతులు

ముంచంగిపుట్టు : ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి పునరుద్ధరించారు. ప్రాజెక్టులోని మూడవ నంబర్ వాల్వ్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయడం తెలిసిందే. అధికారులు, సిబ్బంది రాత్రి, పగలు తేడా లేకుండా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేశారు. వాల్వ్ హౌస్‌లోని 3వ నెంబర్ వద్ద వృక్షాలు, దుంగలు, టీపీ డ్యామ్ వద్ద అడ్డంగా ఉన్న రాళ్లను తొలగించారు. బుధవారం ఉదయం డుడుమ జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. ఉదయం 11.30 గంటలకు ఒకటో నంబర్ జనరేటర్ నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు.మధ్యాహ్నం 3గంటలకు మూడు జనరేటర్ల సాయంతో 50 మెగా వాట్ల ఉత్పత్తి పునరుద్ధించారు. రాత్రి కల్లా 4వ నెంబర్ జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు. జాలీ గేట్ల సమస్యపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. నాన్‌ప్రెజర్ టన్నెల్ వద్ద ట్రాస్‌రాక్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ప్రాజెక్ట్ ఎస్‌ఈ నాగేశ్వరరావు తెలిపారు. ఇంజినీర్లు, అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్లే రెండో రోజుల్లో విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించగలిగామని ఆయన పేర్కొన్నారు.

నాటు కోళ్ల దొంగలు అరెస్టు



నాటు కోళ్లతో పట్టుబడిన నిందితులతో ఎస్‌ఐ నాగేంద్ర తదితర్లు

దేవరాపల్లి: నాటు కోళ్లు ఎత్తుకుపోయారని ఫిర్యాదు అందిన రెండు గంటల వ్యవధిలోనే దేవరాపల్లి పోలీసులు కేసు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఎస్‌ఐ డి. నాగేంద్ర వివరాల ప్రకారం.. మండలంలోని తిమిరాంలో గంపాన శ్రీను, కురందాసు అప్పలనాయుడు, యలమంచిలి దేముడు పశువుల పాకల వద్ద మంగళవారం అర్ధరాత్రి 19 నాటు కోళ్లను దొంగలు ఎత్తుకుపోయారు. ఈ మేరకు బాధితులు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా వి.మాడుగులకు చెందిన బండి కొండిజ, బండి సతీష్, తాడి స్వామిలను వారి స్వగ్రామంలో పట్టుకున్నారు. నాటు కోళ్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు.

మోదకొండమ్మ ఉత్సవ తేదీలు ఖరారు

- మే 14,15,16 తేదీల్లో నిర్వహణ
- ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- ఉత్సవ కమిటీ ఏకగ్రీవంగా ఏర్పాటు

పాడేరు రూరల్: పాడేరు మోదకొండమ్మ తల్లి ఉత్సవాల తేదీలు ఖరారయ్యాయి. పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం అమ్మవారి ఆలయ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. గత ఏడాది ఉత్సవాల ఖర్చులను పట్టణ ప్రజలు, దాతలు, భక్తులకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యస్వామి సమక్షంలో ఉత్సవ తేదీలు ఖారారయ్యాయి. మే నెల 12న అమ్మవారి వార్షికోత్సవం, 14,15,16 తేదిల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర గిరిజన జాతరగా పేరొందిన పాడేరు మోదమ్మ ఉత్సవాలను గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహిస్తామని చెప్పారు.

మోదీ హయాంలో దేశాభివృద్ధి

- రాజ్యసభ సభ్యుడు జీవీఎల్



మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

అనకాపల్లి టౌన్: ప్రధాని మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గంలో బీజేపీ మద్దతుతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.వి.ఎస్.మాధవ్‌ను గెలిపించాలని ఆయన కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ కర్రి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సన్నిహిత సంబంధానికి అడ్డొస్తున్నాడనే...

- పీఎల్‌పురం యువకుడి హత్య కేసు ఛేదన
- హత మార్చిన ముగ్గురు నిందితుల అరెస్టు
- డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ వివరాలు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

పాయకరావుపేట: మండలంలోని పీఎల్‌పురంలో యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. తమ సన్నిహిత సంబంధానికి అడ్డొస్తున్నాడని, తనతో సన్నిహితంగా మెలిగే యువతిని లోబరుచుకోవాలని చూస్తున్నాడనే నెపంతో వడ్లమూరి వీరనాగేంద్రను నిందితులు హత్య చేశారని నర్సీపట్నం డీఎస్పీ పి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మేడిశెట్టి రాజేష్, బల్ల వెంకటేష్, సిద్దా పద్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. బుధవారం పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో సీఐ అప్పలరాజుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

గ్రామానికి చెందిన రాజేష్ అదే గ్రామానికి చెందిన పద్మతో సన్నిహిత సంబంధం పెట్టుకున్నాడు. హతుడు వీరనాగేంద్ర తరచూ ఫోన్ చేయడం, తనతో ఉండాలని ఒత్తిడి చేస్తున్నాడని రాజేష్‌తోపాటు తన సోదరుడు బల్ల వెంకటేష్‌కు ఆమె తెలిపింది. ఈ నేపథ్యంలో మృతుడు వీరనాగేంద్ర, పద్మల మధ్య ఫోన్ సంభాషణలతో రాజేష్ జీర్ణించుకోలేకపోయాడు. ముగ్గురు కలిసి వీరనాగేంద్రను అడ్డు తొలగించుకోవాలని పన్నాగం పన్నారు. గత నెల 27వ తేదీ అర్ధరాత్రి నాగేంద్రకు ఫోన్ చేయించి పద్మ ఇంటికి రప్పించారు. అతడు వచ్చిన వెంటనే ముక్కు మూసి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత పద్మకు చెందిన స్కూటీపై రాజేష్, వెంకటేష్ రైతు మేడిశెట్టి సూర్యనారాయణ అలియాస్ దివాణం పొలం బావిలో కాళ్లు చేతులు కట్టి పడేశారు. బావిలో శవమై కనిపించడంతో గత నెల 28న మృతుడు తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు క్రైమ్ అడిషనల్ ఎస్పీ జి. సత్యనారాయణ పర్యవేక్షణలో నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను ఉపయోగించి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ కేసు ఛేదించడంలో నర్సీపట్నం టౌన్ సీఐ గణేష్, నర్సీపట్నం రూరల్ సీఐ వి. రమణయ్య, నక్కపల్లి సీఐ నారాయణరావు, అనకాపల్లి సర్కిల్ సీఐ రవికుమార్, ఎస్‌ఐలు ఎస్ రమేష్, బి. జోగారావు, అనకాపల్లి టౌన్ ఎస్‌ఐ సింహాచలం, ఎస్.రాయవరం ఎస్‌ఐ పి. ప్రసాద్, సీసీఎస్ సిబ్బంది రమేష్ కీలకంగా వ్యవహరించారు.

‘హత్య వెనుక మరికొంతమంది పాత్ర’



మాట్లాడుతున్న దళిత నాయకులు

పీఎల్‌పురంలో యువకుడు వడ్లమూరి వీరనాగేంద్ర హత్య వెనుక మరికొంత మంది పాత్ర ఉందని, కేవలం ముగ్గురిని మాత్రమే అరెస్టు చేయడం సమంజసం కాదని దళిత నాయకులు బోడపాటి అప్పారావు, పల్లా విలియం కేరి, పెదపాటి మేఘ రంజన్, దిలీప్ తెలిపారు. బుధవారం దళిత నాయకులతో కలిసి డీఎస్పీని కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ హత్య ముగ్గురితో అయ్యే పని కాదన్నారు. దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేసి మిగిలిన వారిని అరెస్టు చేయాలని కోరారు.

విశాఖకు విద్యుత్ బస్సులు

- 100 వరకు వచ్చే అవకాశం
- ఆరు నెలల్లో నగర రోడ్లపై పరుగులు
- సిటీ బస్సులుగా నడపనున్న అధికారులు
- తొలుత సింహాచలం, గాజువాక/వాల్తేరు డిపోలు ఎంపిక
- కొత్తగా మరో 100 డీజిల్ బస్సులు



విద్యుత్ బస్సు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ నగరంలోకి విద్యుత్ బస్సులు రానున్నాయి. ఆరు నెలల్లో ఇవి రోడ్లపై పరుగులు తీయనున్నాయి. ప్రజా రవాణా విభాగం (పూర్వ ఏపీఎస్ ఆర్టీసీ) రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఎలక్ట్రిక్ (విద్యుత్) బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా విశాఖ నగరానికి వంద విద్యుత్ బస్సులు కేటాయించే అవకాశం ఉంది. త్వరలో కార్యనిర్వాహక రాజధాని కానున్న విశాఖకు వంద ఎలక్ట్రిక్ బస్సులు అవసరమని ప్రజా రవాణా విభాగం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ-బస్సులకు లైన్ క్లియర్ కావడంతో తొలివిడతలో 50, మలి దశలో మరో 50 వెరసి వంద బస్సులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విద్యుత్ బస్సులు ఎయిర్ కండిషన్ సదుపాయాన్ని కలిగి ఉంటాయి. బ్యాటరీ సాయంతో నడవనున్నందున ఇవి దూర ప్రాంతాలకు అనువుగా ఉండవు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వీటిని నగరంలో ఎంపిక చేసిన వివిధ ప్రాంతాలకు సిటీ సర్వీసులుగానే నడుపుతారు.

రెండు డిపోలు ఎంపిక..

విశాఖలోని రెండు డిపోల్లో వీటిని ప్రవేశపెట్టాలని ఆర్టీసీ అధికారులు ప్రాథమికంగా నిర్ణయానికొచ్చారు. ఇందుకోసం సింహాచలం డిపోను ఇప్పటికే ఖరారు చేయగా, రెండో డిపోను గాజువాక లేదా వాల్తేరుల్లో ఒకదానికి ఎంపిక చేయనున్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒక గ్యారేజీని ఏర్పాటు చేస్తారు. సింహాచలం సింహపురి కాలనీలో ఉన్న ఆర్టీసీ స్థలంలో ఈ ఎలక్ట్రిక్ గ్యారేజీకి అనువుగా ఉంటుందని నిర్ణయించారు. విశాఖకు కనీసం వంద విద్యుత్ బస్సులు అవసరమవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు ‘సాక్షి’కి చెప్పారు. తొలిదశలో బస్సులు రావడానికి ఆరు నెలల సమయం పట్టవచ్చని భావిస్తున్నామన్నారు.

మరో వంద డీజిల్ బస్సులు..

విశాఖపట్నం జిల్లాకు విద్యుత్ బస్సులతో పాటు మరో వంద వరకు కొత్త డీజిల్ బస్సులు రానున్నాయి. ఆర్టీసీలో 13 లక్షల కిలోమీటర్లు తిరిగిన లేదా 15 ఏళ్లు పూర్తయిన బస్సులను తొలగిస్తారు. వాటి స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెడ్తారు. మరి కొన్ని బస్సులను 9-10 లక్షల కిలోమీటర్లు తిరిగాక పల్లెవెలుగు సర్వీసులుగా బాడీని మార్పు చేసి నడుపుతారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 15 ఏళ్లు పూర్తి చేసుకున్న బస్సులు 35 వరకు ఉన్నాయి. త్వరలోనే వాటిని నిలిపివేయనున్నారు. 2024 సంవత్సరంలో మరికొన్ని బస్సులకు కాలం చెల్లనుంది. ఈ నేపథ్యంలో పాత బస్సుల స్థానంలో కొత్తవి, డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన సర్వీసులు వెరసి మరో వంద వరకు డీజిల్ బస్సులు కేటాయించే వీలుందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి మంత్రి రాక నేడు

కశింకోట : కశింకోటలో గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి విచ్చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు బుధవారం తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం



విద్యార్థితో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్సపొందుతున్న ఆరుగురు విద్యార్థులను బుధవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. మండలంలోని మాకవరం గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో గాయపడిన విద్యార్థులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద ఘటనపై మంత్రి అమర్‌నాథ్ ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సంబరాల హోలీ



చింతలపాలెంలో చిన్నారుల హోలీ ఆనందం

కశింకోట : మండలంలో హోలీ పండగను బుధవారం ఆనందోత్సాహాలతో జరిపారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు కూడా పరస్పరం రంగులు జల్లుకుని ఆనందంతో బైక్‌ల మీద తిరుగాడుతూ కేరింతలు కొట్టారు. ఇక్కడి ఇటుకల బట్టీల్లో పని చేయడానికి వచ్చిన ఒడిశా కూలీలు రంగులు పూసుకుని రెట్టించిన ఉత్సాహంతో హోలీ చేసుకోవడాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. చింతలపాలెంలో చిన్న పిల్లలు రంగులు జల్లుకొని ఆనందోత్సాహంతో తిరుగుతూ ఆకట్టుకున్నారు.

అనకాపల్లి సినిమాలు

గ్రంథాలయం	రాజా
కోనసీమ	సత్యనారాయణ-1
సాచి	సత్యనారాయణస్క్రీన్-2
వినరోభాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు	వెంకటేశ్వర
బిగ్‌స్నేక్ కింగ్	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 5,847 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,690	3,990
మొదటి రకం	3,450	3,700
రెండో రకం	3,150	3,490
మూడో రకం	3,030	3,140

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-11 యూనిట్లు, ఓ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 337 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

మహిళలు.. మహారాణులు



ప్రజారవాణా శాఖ కార్యాలయంలో మహిళా కండక్టర్‌ను సత్కరిస్తున్న పద్మావతి



ఏపీటీఎఫ్ భవనంలో ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

ఆడాళ్లా.. మీకు జోహార్లు.. ఓపిక, ఒద్దిక మీ పేర్లు.. మీరు ఒకరి కంటే ఒకరు గొప్పోళ్లు.. అన్నాడు మనసు కవి ఆచార్య ఆత్రేయ. ముళ్లపూడి వారైతే.. ఆడా మగా సమానమే కాకపోతే మగాళ్లు కాస్త ఎక్కువ సమానం అన్నారు. ఆకాశంలో సగం వినేందుకు బాగానే ఉంటుంది.. కానీ ఆచరణలో ఎన్నిమైళ్ల దూరమో..! మన రాష్ట్రంలో మాత్రం ఆడాళ్లే కాస్త ఎక్కువ సమానమంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. ఎందుకంటే జగనన్న పాలనలో రాజకీయాల్లో సగం సీట్లు మహిళలకే కేటాయించారు. జనరల్ కేటగిరీలో కూడా మహిళలు పోటీపడొచ్చు. దీంతో ఇక్కడ మగాళ్లకంటే మహిళలే ముందంజలో ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఊరూవాడా వేడుకలు ఘనంగా నిర్వహించారు.

– అనకాపల్లి టౌన్



వేల్పులవీధి రాందేవ్ వ్యాయామ సంఘంలో ఆడారి జోత్స్నను సత్కరిస్తున్న శిలపరశెట్టి బాబీ



విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘ కార్యాలయంలో న్యాయమూర్తులకు సత్కారం



సత్యదేవ్ ఆస్పత్రిలో మహిళా వైద్యులను సత్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు



వెంకటేశ్వర నర్సింగ్‌హోంలో జెడ్పీ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహసత్యవతికి వాకర్స్ క్లబ్ సత్కారం



ఆస్క్ ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్

- ఊరూవాడా ఘనంగా మహిళా దినోత్సవం
- పలువురు మహిళల్ని సన్మానించిన సంఘాలు

పట్టణంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ సంస్థలు, కార్యాలయాలు, రంగాల్లో పని చేస్తున్న, ప్రతిభ కలిగిన మహిళలను సన్మానించారు.

● స్థానిక ప్రజారవాణా శాఖ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి ఇద్దరు చొప్పున నలుగురు మహిళా కండక్టర్లకు జిల్లా ప్రజారవాణా శాఖాధికారి కె.పద్మావతి ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుజాత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● దాడి వీరునాయుడు కళాశాలలో మహిళా దినోత్స వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉషారాణి మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. ఎస్‌ఐ సావిత్రి మాట్లాడుతూ మహిళలు ఎక్కడకు వెళ్లినా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెట్విస్ మేనేజర్ బి.నూకరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దయామాధురి, యల్లపు శ్యామల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఏపీటీఎఫ్ భవనంలో పాఠశాలల ఉపాధ్యాయినిలను ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.వెంకటపతిరాజు సత్కరించారు. సభ్యులు కేపీఎల్ గణేష్, డి.నూకేష్, నరసయ్యనాయుడు, కన్నారావు, ప్రసాద్, స్వరూప, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

● స్థానిక ఉడ్‌పేట విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం భవనంలో మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మహిళా న్యాయవాదులు నిరూప భంజ్‌దేవ్, పి.ప్రదీపలతోపాటు న్యాయవాదులు కేత కుసుమ, పద్మ, న్యాయవాది కనిశెట్టి సురేష్‌బాబు, దివ్యాంగులకు జన్మనిచ్చిన తల్లులను సంఘ వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్, కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌లు సత్కరించారు.

● స్థానిక సత్యదేవ్ ఆస్పత్రిలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాసంఘాల నేతలు మహిళా వైద్యులు బొడ్డేడ అలేఖ్య, చదరం గీతాంజలిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు బొడ్డేడ అప్పారావు, చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, ఆడారి బుచ్చిరాము, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజు, కిల్లాడ నూకరాజు, పల్లా సత్య అప్పారావు, భర్నికాన సూరిబాబు పాల్గొన్నారు.

● స్థానిక వెంకటేశ్వర నర్సింగ్‌హోంలో వాకర్స్‌క్లబ్ సభ్యులు జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, కొత్తూరు పంచాయతీ అధ్యక్షురాలు సుబ్బారపు లక్ష్మీప్రసన్నలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు యల్లపు సాంబశివరావు, కార్యదర్శి భీశెట్టి రామకృష్ణ, వైద్యుడు డి.డి.నాయుడు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

● గవరపాలేనికి చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి ఆడారి జోత్స్నను స్థానిక వేల్పులవీధి శ్రీరాందేవ్ వ్యాయామ సంఘంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ సత్కరించారు.

● స్థానిక హిమశేఖర్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోటలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలం నుంచి హాజరైన స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. బాల బాలికలను వివక్ష లేకుండా సమానంగా పెంచుతామని, బాల్య వివాహాలు అరికడతామని, సమాన పనికి సమాన వేతనం అందేలా చూస్తామని, మహిళా సాధికారతకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కుర్చీలాట ఆడించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే పాటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, కార్యదర్శి అప్పలనరసమ్మ, కోశాధికారి లక్ష్మి, ఏపీఎంలు ఎస్. శ్రీనివాసరావు, తిలక్, వెలుగు సిబ్బంది అనురాధ, నిర్మల, సత్యనారాయణ, రామకృష్ణ, వాణి తదితరులు పాల్గొన్నారు. తాళ్లపాలెంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా ఉపాధి కూలీలకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ టిఫిన్ బాక్సులను పంపిణీచేశారు. మజ్జిగ ప్యాకెట్లు అందించారు.

ఉగ్గినపాలెంలో..

మండలంలోని ఉగ్గినపాలెంలో ఎంపీపీ కలగా లక్ష్మి సమక్షంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు చైర్మన్ బుదిరెడ్డి కుమారి, వీవోఏ కలగా పద్మ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్ ఎద్దు చిన్నారిలను దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు పాల్గొన్నారు.

● గొబ్బూరు, సుందరయ్యపేట, జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం తదితర గ్రామాల్లో కూడా స్వయం సహాయక సంఘాలు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అనకాపల్లి రూరల్ : మహిళలు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని అనకాపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత, ప్రజారవాణా అధికారి పద్మావతి సూచించారు. జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న మహిళా దినోత్సవ కార్యక్రమాలను అనకాపల్లి, నర్సీపట్నం ఆర్టీసీ డిపోల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో అనకాపల్లి సత్యనారాయణపురం దేవస్థానం ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. రెండు డిపోల పరిధిలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను సత్కరించారు. కేకే లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కె.బిక్కు బాబు, వై.రాము, జి.రమణ, బీవీఎస్ నారాయణ, డీఈ రావు, డీఎల్ రాజు, బీఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఆస్క్ ఇంజనీరింగ్ కళాశాలలో..

స్థానిక ఆస్క్ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని గతంలో మహిళా శ్రామిక దినోత్సవంగా నిర్వహించేవారన్నారు. 1908 మే 3 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుతున్నారని చెబుతూ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



కశింకోటలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ



తాళ్లపాలెంలో ఉపాధి కూలీలకు టిఫిన్ బాక్సులు అందిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని



ఉగ్గినపాలెంలో వీవోఏ పద్మావతిని సత్కరిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



దాడి వీరునాయుడు కళాశాలలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సావిత్రి



సత్యనారాయణపురం దేవస్థానం ప్రాంగణంలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు సత్కారం

రంగుల హోలీ.. ఆనందాల కేళీ



రంగులు పూసుకుని సందడి చేస్తున్న చిన్నారులు



హోలీ సంబరాల్లో ఎన్టీపీసీ ఉద్యోగ కుటుంబాలు



హోలీ సంబరాల్లో సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలి నగర్ టౌన్‌షిప్‌లో హోలీ సంబరాలను బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఎన్టీపీసీ అధికారులు, కుటుంబ సభ్యులు ఒకరికొకరు రంగులు చల్లుకుని ఉత్సాహంగా గడిపారు. మిఠాయిలు తినిపించుకొని ఎంజాయ్ చేశారు. హోలీ సంబరాల్లో పాల్గొన్న సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా సంస్థ ఉద్యోగులు, ఉద్యోగ కుటుంబాలు, డీఎల్‌సీ ప్రతినిధులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సీతంరాజు సుధాకర్ గెలుపు ఖాయం



బాలికోన్నత పాఠశాల టీచర్లతో మాట్లాడుతున్న జాజుల రమేష్



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపు ఖాయమని పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ అన్నారు. 83వ వార్డు పరిధిలో పార్టీ శ్రేణులతో ఆయన బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. విశాఖను రాజధానిగా ప్రకటించడమే కాకుండా జీఐఎస్ ద్వారా సుమారు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు, 6 లక్షల మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్న సీఎం జగన్ పాలనకు మద్దతుగా నిలవాలని పట్టభద్రుల్ని కోరారు. మొదటి ప్రాధాన్యతా ఓటును సుధాకర్‌కు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఎ.రత్నకుమారి, బుద్ద భాస్కర్, బుద్ద పెంటారావు, కొమ్మన శంకర్, రేబాక స్వామి, మళ్ల సత్యనారాయణ, పాము సన్నిబాబు, మేడిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

కశింకోట : వైఎస్సార్ సీపీ బలపర్చిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ శ్రేణులు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా కాలనీ, అఫీషియల్ కాలనీ, అగ్రహారం ప్రాంతాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, పార్టీ సచివాలయ కన్వీనర్ మారిశెట్టి శ్రీనివాసరావు, వార్డు మెంబర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తొలేళ్లు



సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి, బంగారమ్మపాలెం గ్రామాల్లో కొలువైన ముత్యాలమ్మ పండగలో భాగంగా బుధవారం తొలేళ్ల సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి ఆయా గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకాపల్లిలోని ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి గురువారం జిల్లా నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అందుకు తగ్గట్టుగా భక్తులు సౌకర్యార్థం ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. అనుపు మహోత్సవంలో భాగంగా గురువారం రాత్రి నిర్వహించనున్న సాము గరిడీలు, బాణ సంచాపోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, స్థానిక నాయకులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

అనకాపల్లిటౌన్ : స్థానిక లక్ష్మీదేవిపేట కల్యాణమండపంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు గౌరీ సేవా సంఘం, వాల్మీకి సేవాసంఘం సభ్యులు గురువారం తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ(డీవీఎంసీ) సభ్యులు రేబాక మధుబాబు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రక్తదాన శిబిరంతోపాటు బీపీ, సుగర్, క్యాన్సర్, కళ్లు, గుండె, కీళ్లు, స్త్రీ సంబంధిత వ్యాధులకు వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందిస్తారన్నారు.

ఇంటింటికీ తాగునీరు

- జల్ జీవన్ మిషన్‌తో కుళాయి కనెక్షన్ల ఏర్పాటు
- రూ.కోటితో నాలుగు పంచాయతీలకు కుళాయి నీరు
- తుది దశకు చేరుకున్న పనులు



చింతలపాలెంలో జేసీబీ సహాయంతో భూగర్భ పైప్‌లైన్ పనులు



చింతలపాలెం కాలనీలో ఇళ్ల వద్ద కుళాయి కనెక్షన్లు

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు ఇచ్చే పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటికి జల్ జీవన్ మిషన్ నిధులు సుమారు రూ.కోటి మంజూరయ్యాయి. మండలంలోని నాలుగు పంచాయతీల్లో కుళాయిల ఏర్పాటుకు ఈ నిధుల్ని వెచ్చిస్తున్నారు. దీంతో కుళాయిల ఏర్పాటు పనులు జోరందుకున్నాయి.

రూ.37 లక్షలతో 'చింత'తీరనుంది

చింతలపాలెం పంచాయతీ పరిధిలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.37 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో రూ.13 లక్షలతో ఇప్పటికే కాలనీలో ప్రతి ఇంటికీ కుళాయిలు అమర్చారు. వాటి నుంచి నీటి సరఫరా కూడా ప్రారంభించారు. పూర్తి స్థాయిలో సరఫరా అయితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కినట్టేనని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చింతలపాలెం ఊరిలో మిగిలిన రూ.24 లక్షలతో పనులు జరుగుతున్నాయి. జేసీబీతో కాలువ తవ్వి భూగర్భంలో పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ఉప్పునీటి వెతలకు చెక్

తాళ్లపాలెంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల కోసం రూ.20 లక్షలతో పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 1, 2 వార్డుల్లో పనులు పూర్తయ్యాయి. సుమారు వెయ్యి ఇళ్లకు కుళాయి కనెక్షన్లు కూడా ఇచ్చారు. ప్రస్తుతం 3వ వార్డులోని దుర్గాలమ్మపేటలో పనులు జరుగుతున్నాయి. నెలాఖరుకు పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీ పరిధిలో మొదటి విడతలో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే తాళ్లపాలెం సంత, గొల్లపేట ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీరందిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. గ్రామం అంతటా దాదాపు ఉప్పునీరే లభిస్తుండటంతో కుళాయి నీరే మంచినీటికి ఆధారం. ప్రస్తుతం వీధి కుళాయిల వద్ద సేకరిస్తున్న నీరు ఇంటింటి కుళాయి కనెక్షన్ల ఏర్పాటుతో మరింత చేరువయింది. దీంతో స్థానిక ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

తుది దశకు పనులు

తేగాడ గ్రామంలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.28 లక్షలు కేటాయించారు. ఇక్కడ సుమారు 600 ఇళ్లు ఉండగా ఇప్పటికే 25 శాతం మేర గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారిక సమాచారం. మిగిలిన వారికి కూడా కనెక్షన్లు ఏర్పాటు చేసేలా చురుగ్గా పనులు జరుగుతున్నాయి. జి.భీమవరంలో రూ.14 లక్షలతో చేపట్టిన కుళాయి పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇవి పూర్తి స్థాయిలో నీటి సరఫరా ప్రారంభిస్తే, ఏళ్లనాటి వీరి కల నెరవేరినట్లే.

నీటి ఇక్కట్లకు చెక్



నీటి సమస్యతో నిత్యం ఇబ్బంది పడుతున్న తమ కాలనీలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. కుళాయిల ద్వారా నీటి సరఫరా కూడా తాజాగా ప్రారంభించారు. పూర్తి స్థాయిలో నీటిని అందిస్తే ఇక త్రాగునీటి సమస్య ఉండదు.

–జానకి, చింతపాలెం కాలనీ, కశింకోట మండలం

నాలుగు పంచాయతీల్లో పనులు ముమ్మరం

మండలంలో జల్ జీవన్ మిషన్ కింద నాలుగు పంచాయతీల్లో సుమారు రూ.కోటితో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. చింతలపాలెం, తేగాడ, తాళ్లపాలెం, జి.భీమవరం గ్రామాల్లో ప్రస్తుతం పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. చింతలపాలెం కాలనీలో ఇప్పటికే కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. గ్రామంలో పనులు జరుగుతున్నాయి. సాధ్యమైనంత మేర త్వరితగతిన పనులు పూర్తి చేసి ఇళ్లకు కుళాయి నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

–పావని, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, అనకాపల్లి

మదర్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం



ఆచార్య పడాల్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న సత్యగంగరాజు

సబ్బవరం: సేవా కార్యక్రమాలు చేపట్టడంలో లభించే సంతృప్తి మరెక్కడా దొరకదని ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ ఆచార్యుడు ఎస్‌బీ పడాల్ అన్నారు. సబ్బవరంలోని మదర్ చారిటబుల్ ట్రస్టును బుధవారం సందర్శించిన ఆయన ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలుసుకున్నారు. 9 ఏళ్లుగా ట్రస్టు ద్వారా అందిస్తున్న పలు సేవా కార్యక్రమాలను చూసి అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఆచార్య పడాల్‌ను ట్రస్టు టెక్నికల్ సలహాదారునిగా ట్రస్టు చైర్మన్ సత్యగంగరాజు నియమించారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్లు పి. శ్రీనివాసరావు, టి. తారకేశ్వరి, ఆర్ మౌనిక, జి రమేష్, జ్యోతి, సుశీల, విలియంకేరీ తదితరులు పాల్గొన్నారు.